'పత్రిక' మాసపత్రిక - 19-01-2005

# విష్ణుమాయ

ఓ భక్తురాలు వరలక్ష్మీ వ్రతం చేసి, 'తల్లీ! నా భర్త చేతికి ఎముక లేకుండా, అడిగిందే తడవు అయిన వారికీ, కాని వారికీ సహాయం చేస్తున్నాడు. వచ్చే సంపాదనంతా దానధర్మాలకే ఖర్చయిపోతోంటే ఇల్లు గడవడం కష్టమైపోతోంది. అందుకని మాకు మరిన్ని భోగభాగ్యాలు కలిగించి ఆదుకోవమ్మా!' అని ప్రార్థించింది.

'ఈ భక్తురాలి విషయం ఏం చేద్దామ'న్నట్లుగా లక్ష్మీదేవి విష్ణుమూర్తి వైపు చూసింది.

'వ్రతకథా ప్రకారం నువ్వు ముసలి ముత్తయిదువ రూపంలో వెళ్లి, ఈ రాత్రికి ఆమె ఆతిథ్యం స్వీకరించాలి. ఆమె ఇంటి మూలల్లో సువర్ణ రాశులు కురిపించాలి. ఇవిగో, ఈ నాలుగు బియ్యపు గింజల్నీ తీసుకువెళ్లి, ఆమెకు తెలియకుండా ఆమె వండే పాయసంలో పడవెయ్యి' అని ఓ నాలుగు బియ్యపు గింజల్ని లక్ష్మిచేతిలో ఉంచాడు విష్ణువు.

లక్ష్మీదేవి ఆ విధంగానే చేసి, మర్నాడు ఉదయం భక్తురాలిని - 'ఇష్ట కామనా సిద్ధిరస్తు!' అని దీవించి వైకుంఠానికి తిరిగి వెళ్లింది. భక్తురాలి ఇంట్లో సువర్ణవర్షం కురిపించడం మరిచిపోయింది.

అనతికాలంలోనే భక్తురాలికి 'నేనూ, నా భర్తా, నా పిల్లలూ, నా సంసారమూ' అన్న భావన మనసులో బలంగా నాటుకొంది. భర్త చేతి ఎముక గట్టిపడింది. పిడికిలి బిగిసింది. ఆ తర్వాత సంసారానికేవిధమైన ఇబ్బందీ కలగలేదు.

'నాథా జరిగిందేమిటి?! లక్ష్మీదేవి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

'యుగధర్మానికి విరుద్ధంగా దారితప్పి నడుస్తున్న వారి మనసుల్లో కలియుగ ధర్మబీజాల్ని నాటానంతే!' అన్నాడు విష్ణువు మందహాసంతో.

భక్తురాలు పెట్టిన పాయసం ఆరగించిన లక్ష్మీదేవి కూడా వరప్రదానాలు చెయ్యడం మరిచి పోయింది.

*(నీతి: ఋణాలివ్వవలసిన కలికాలంలో దానాలు చెయ్యకూడదు!)*